క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌: గౌడ సంఘం ఆధ్వర్యంలో దివంగత మాజీ ఎమ్మెల్యే దేశిని మల్లయ్య విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ ఆస్పత్రి చౌరస్తాలో ఆదివారం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దేశిని మల్లయ్య విగ్రహం పెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత, వైస్‌ చైర్‌పర్సన్‌ అనిత, కౌన్సిలర్‌ కొంకట నళినిదేవి, మాజీ సర్పంచ్‌ లింగమూర్తి, గౌడ సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్‌ గౌడ్‌, రవీందర్‌గౌడ్‌, పచ్చిమట్ల అంజయ్య, బత్తిని లక్ష్మయ్యగౌడ్‌, పూదరి చంద్రమౌళి, కోయ్యడ శ్రీనివాస్‌గౌడ్‌, లక్ష్మీనారాయణ, పూదరి శ్రీనివాస్‌గౌడ్‌, పెరుమాండ్ల మల్లాగౌడ్‌, నర్సాగౌడ్‌ తదితరులు ఉన్నారు.


ఆర్థికసాయం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద చిన్నగల్ల మల్లయ్య కుటుంబానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్‌ మండల యూత్‌ అధ్యక్షుడు ధర్మారం కుమార్‌ పరామర్శించి రూ.3వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ ముక్కపల్లి కనకయ్య, ఎంపీటీసీ ధర్మారం లక్ష్మీమల్లయ్య, నాయకులు బాబు, కనకయ్య, మల్లేశం, ఎల్లయ్య, నర్సింహులు, స్వామి, లచ్చయ్య, శ్రీను, రాజు ఉన్నారు.

ఎంపీటీసీలకు నిధులు కేటాయించాలి

కొండపాక(గజ్వేల్‌): ఎంపీటీసీలకు నిధులు కేటాయించి ప్రజల్లో చులకన కాకుండా చూడాలని ఎంపీటీసీ మంచాల అనసూయ కోరారు. మండల కేంద్రమైన కొండపాకలో ఆదివారం ఎంపీటీసీ ఆరుట్ల లక్ష్మితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి పనుల నిర్వహణలో కొంత సొమ్మును ఎంపీటీసీల కోటాలో కేటాయించాలన్నారు. ప్రజల సమస్యల్లో పాలుపంచుకుంటూ సేవ చేయాలన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్‌ పార్టీ బీఫామ్‌పై గెలుపొందామన్నారు. గెలిచిన నాలుగున్నర ఏళ్లలో నయా పైసా నిధులు కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా చూస్తూ ప్రజల్లో చులకన చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ అభివృద్ధి పనుల నిర్వహణ విషయాల్లో ఉన్నత స్థాయి అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు కనీసం సమాచారం అందించకుండా అగౌరవ పరుస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఎంపీటీసీలకు నిధులు కేటాయిస్తూ గౌరవాన్ని కాపాడాలన్నారు. మూడు నెలలకోసారి జనరల్‌ బాడీ సమావేశాలకు ఆహ్వానం పంపడం తప్పా ఎంపీటీసీలకు ఎలాంటి గౌరవం దక్కడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



నగదు అందిస్తున్న మిత్రులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన కాసుల శ్రీనివాస్‌ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు 1990లో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.31వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అవుశర్ల నర్సింహులు, నాగుల యశ్వంత్‌, కాటం శ్రీనివాస్‌, తాడెం శ్రీనివాస్‌, తాటికొండ తుకారాం, బ్రాహ్మండ్లపల్లి మహేశ్‌, ఆమిడెపు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): భవన నిర్మాణ రంగాల కార్మికులు పనిని మెరుగుపరుచుకునేందుకు శిక్షణ అవసరమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్ర భిక్షపతి అన్నారు. జాతీయ నిర్మాణ సంస్థ(న్యాక్‌) ఆధ్వర్యంలో 15 రోజుల పాటు జగదేవ్‌పూర్‌లో వివిధ అంశాలపై నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు ఆదివారం సర్టిఫికెట్లను అందించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని నిర్మాణ రంగంలో మరింతగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణమూర్తి, న్యాక్‌ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్యం.. వందశాతం

- కొనసాగుతున్న ఇంటి పన్ను వసూళ్లు
- అవగాహన కల్పిస్తున్న బల్దియా అధికారులు



పన్నుల రశీదు అందిస్తున్న మున్సిపల్‌ సిబ్బంది



దుబ్బాక మున్సిపల్‌ కార్యాలయం

దుబ్బాక: మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరు అయిన పన్ను వసూలుపై దుబ్బాక పాలకవర్గం, అధికారులు దృష్టి సారించారు. వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో వంద శాతం పన్ను వసూలు లక్ష్యంగా అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. గతేడాది 90శాతం పన్ను వసూలు చేయగా, ఈ ఏడాది నూరుశాతం చేసేలా కార్యాచరణ ప్రారంభించారు. ఇప్పటికే వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దుబ్బాక మున్సిపల్‌ కమిషనర్‌ పాతూరి గణేశ్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గన్నె వనిత భూంరెడ్డి, కౌన్సిలర్లు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

మున్సిపల్‌ పరిధిలో 48శాతం..

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన గ్రామాలైన చెల్లాపూర్‌, దుంపలపల్లి, ధర్మాజీపేట, లచ్చపేట, చెర్వాపూర్‌, దుబ్బాకను కలుపుకొని మొత్తం 5,836 ఇళ్లు ఉండగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.81లక్షల 2వేల పన్నులను వసూల్‌ చేశారు. ఇంకా రూ.93లక్షల 65 వేలను మార్చిలోగా వసూల్‌ చేయడానికి మున్సిపల్‌ సిబ్బంది స్పెషల్‌ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మొండి బకాయిదారులకు రెడ్‌ నోటీసులు జారీ చేస్తున్నారు. అప్పటికి స్పందించకపోతే వారి వస్తువులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సమష్టి కృషితో సాధిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. మున్సిపల్‌ సిబ్బంది, పాలకవర్గం సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుంది. ప్రజల్లో సైతం పన్ను చెల్లింపులపై అవగాహన పెరిగింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ఏడాది ప్రక్రియ పూర్తి చేస్తాం.

– పాతూరి గణేశ్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌, దుబ్బాక

ప్రజలు సహకరించాలి



దుబ్బాక మున్సిపాలిటీని ఉన్నతంగా నిలబెట్టడానికి ప్రజల సహకారం అవసరం. ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్‌ అభివృద్ధికి సహకరించాలి.

– గన్నె వనితాభూంరెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, దుబ్బాక

అవినీతి పాలనను అంతం చేయడమే లక్ష్యం

కాంగ్రెస్‌ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్‌



లచ్చపేటలో కరపత్రాలు పంచుతున్న కత్తి కార్తీక

దుబ్బాక: మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తెచ్చి దేశంలో మంటలు రేపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌ నాయకుడు రాహుల్‌ గాంధీ భారత జోడోయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారని కాంగ్రెస్‌ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్‌ అన్నారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని లచ్చపేటలో హథ్‌ సే హథ్‌ జోడో యాత్ర కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ దేశం, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పాలనను గురించి ప్రజలకు వివరించారు. అనంతరం దుబ్బాక పట్టణంలో బాలాజీ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు 4080 కిలోమీటర్ల యాత్ర నిర్వహించి రాహుల్‌ గాంధీ చరిత్ర సృష్టించారని కొనియాడారు. జోడోయాత్రలో ఆయన సూచించిన సందేశాన్ని దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ ఇంటికి చేరుస్తానన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేసి కాంగ్రెస్‌ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ అధ్యక్షుడు సూర్యవర్మ, జిల్లా కాంగ్రెస్‌ మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు మజీర్‌ మాలీక్‌, నాయకులు కమలాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, తదితరులున్నారు.

నత్తనడకన వైకుంఠధామం పనులు



గౌరవెల్లిలో అసంపూర్తిగా వైకుంఠధామం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): దహన సంస్కారాలు నిర్వహించేందుకు గ్రామాల్లో ప్రజలు పడే ఇబ్బందులు తీర్చేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో చాలా గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా, అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో రూ.12లక్షల పైచిలుకుతో నిర్మిస్తున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి కొన్ని నెలలు గడుస్తున్నా నిర్మాణం పనులు పూర్తి కాలేదు. దీంతో ఇక్కడి ప్రజలు ఎప్పటిలాగే వాగు ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహిస్తూ ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డిని సంప్రదించగా.. పనులు దాదాపు 65శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు పదే పదే చెబుతున్నాను. పనులు త్వరగా పూర్తిచేయించేలా చర్యలు తీసుకుంటా అని చెప్పారు.

జనావాసాల్లో పందుల విహారం



పలు వార్డుల్లో సంచరిస్తున్న పందులు

మిరుదొడ్డి(దుబ్బాక): జనావాసాల మధ్య విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్న పందులకు కళ్లెం వేయాలని మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పలు వార్డులకు చెందిన ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా పందులు ఇళ్ల మధ్య తిరుగుతూ పరిసరాలను అపరిశుభ్రతకు నిలయంగా మారుస్తున్నాయని ఆయా వార్డుల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని మండిపడుతున్నారు. ఇళ్ల పరిసరాలను ఆవాసాలుగా మార్చుకుంటున్న పందులతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, ఫలితంగా అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోయారు. పందుల స్వైర విహారంపై అటు గ్రామ పంచాయతీ పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పందులు పరిసరాల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేదంటే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని రేబర్తి గ్రామంలో కురుమల కులదైవమైన బీరప్ప పెద్ద ఉత్సవాలకు ఆదివారం అంకుర్పారన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కురుమలంతా జల కడువలను తలపై పెట్టుకొని ఒగ్గుబీర్ల కళాకారుల విన్యాసాలు, బగగ్గుడోలు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య పెద్ద ఎత్తున ఊరేగింపుతో నూతనంగా నిర్మించిన ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయం వద్ద ఒగ్గుబీర్ల పూజారులు అక్క మహంకాళి, కమరాతి–బీరప్ప దేవతామూర్తులకు జలాభిషేకంతో పాటు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి కురుమలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గ్రామంలో పండగ సందడి నెలకొంది. అనంతరం మార్చి 2వ తేదీ నుంచి జరగనున్న బీరప్ప పండగకు అంకురార్పన చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో బీరప్ప పెద్ద పండగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కురుమ సంఘం పెద్దలు తెలిపారు.



జలకడువతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నియామకం



నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్‌): కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొండపాకకు చెందిన విజయ్‌కుమార్‌ నియామకం అయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు ప్రీతం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ్మను ఆదివారం కలిసి ఆశీస్సులు పొందారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు జశ్వంత్‌రెడ్డి, పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మామిడ్యాల శ్రీనివాస్‌, సుప్రభారత్‌లకు విజయ్‌కుమార్‌ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గజ్వేల్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ జెండా ఎగిరేలా కార్యకర్తలను, నాయకులను కలుపుకొని కృషి చేస్తామన్నారు.

ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

దుబ్బాక: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకెళ్లాలని ఎంపీపీ కళ్లూరి అనితశ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం రాయపోల్‌ మండలం ఆరెపల్లి గ్రామంలో ఆరెకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని జెడ్పీటీసీ యాదగిరి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరె క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు భూపతి రావు, మండల అధ్యక్షుడు రజనీకాంత్‌, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్‌, నాయకులు గణేశ్‌, నందు, రవి, రాజు, తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): పట్టణంలోని ఆదిత్య విద్యాలయం 1995 –96 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, తమ గురువులను ఘనంగా సన్మానించారు. చిన్నతనంలో తాము చేసిన అల్లరిని ఒకరికొకరు చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మాజీ హెచ్‌ఎం కృష్ణప్రసాద్‌, శ్రీనివాస్‌, కృష్ణాకర్‌ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మద్దూరు(హుస్నాబాద్‌): నేడు మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట



శివాలయంలో పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పీర్లపల్లి గ్రామంలో పురాతన శివాలయంలోని ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు మూడురోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి పూజ, విగ్రహప్రతిష్ఠ, బలిహరణము, పూర్ణాహుతి, శివపార్వతి కల్యాణోత్సవం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి హాజరై ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధి దాత కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అలాగే గజ్వేల్‌ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ యాదవరెడ్డి, ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్‌ ప్రవీణ్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, ఇటిక్యాల సర్పంచ్‌ చంద్రశేఖర్‌, ఎంపీపీ బాలేషంగౌడ్‌, నాచారం డైరెక్టర్‌ నాగరాజు, జగదేవ్‌పూర్‌ మాజీ సర్పంచ్‌ కరుణాకర్‌, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రానిది కక్షపూరిత ధోరణి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎంపీని ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

దుబ్బాకటౌన్‌: దేశాభివృద్ధిని పట్టించుకోకుండా ఉన్న సంపదనంతా ఆదానికి దోచిపెట్టి ప్రపంచ కుబేరుడిని చేసిన కేంద్రంలోని మోదీ సర్కార్‌ పేద ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఎంపీ, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌ రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాకలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం పూర్తిగా తెలంగాణపై కక్షపూరిత ధోరణిని అవలంభిస్తుందన్నారు. న్యాయపరంగా తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. మోదీ సర్కార్‌ పాలనపై ప్రజలు విసుగుచెందారని ఈ తరుణంలోనే దేశప్రజలను కాపాడాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్‌ బీఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేశాడన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు యావత్‌ దేశానికే రోల్‌ మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు ముందు ఉపఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత ప్రభుత్వంపై మాట్లాడాలని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గెలిచి రెండేళ్లు అవుతున్నా కేంద్రం నుంచి నయాపైసా తెచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. సమావేశంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు రొట్టె రాజమౌళి, బక్కి వెంకటయ్య, గన్నె భూంరెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, పల్లె వంశీకృష్ణాగౌడ్‌, బానాల శ్రీనివాస్‌, ఎంగారి రాజిరెడ్డి, పడాల నరేశ్‌, శ్రీరాం రామకృష్ణప్రభు తదితరులు ఉన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సాయిలు

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గజ్జెల సాయిలు, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్‌ నమిలె భాస్కరాచారి అన్నారు. మండల పరిధిలోని చెప్యాలలో ముదిరాజ్‌ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ వల్లాల సత్యనారాయణ, వైస్‌ చైర్మన్‌ చందపురం మల్లేశం, మాజీ ఏఎంసీ చైర్మన్‌ నంట బాపురెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు రవీందర్‌రెడ్డి, గుడిసె గంగాధర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ చైర్మన్‌కు అభినందనల వెల్లువ



బండ ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

తొగుట(దుబ్బాక): శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌ను ముదిరాజ్‌ సంఘం నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ చైర్మన్‌గా నియమించిన సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ సంఘం జిల్లా నాయకుడు, ఎల్లారెడ్డిపేట ఎంపీటీసీ వెల్పుల స్వామి, నాయకులు సాయికుమార్‌, మెట్టు స్వామి, ఇప్ప దయాకర్‌, తొగుట మాజీ సర్పంచ్‌ పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండ ప్రకాశ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో మండల ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు పోచయ్య ఆధ్వర్యంలో సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్‌లకు బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎమ్మెల్యే రసమయిని విమర్శిస్తే సహించం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్‌ నాయకుల విమర్శలు మానుకోవాలని బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు లింగాల లక్ష్మణ్‌, కనగండ్ల తిరుపతిలు హెచ్చరించారు. బెజ్జంకిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేస్తూ ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యేను నియోజకవర్గంలోని గ్రామాల పేర్లు తెలియని నాయకులు విమర్శించడం అవివేకమన్నారు. భూకబ్జాలు కాంగ్రెస్‌ పార్టీ హయాంలోనే జరిగాయని మండలంలో బీఆర్‌ఎస్‌ చేసిన అభివృద్ధిని చూసి మాట్లాడాలని హితువు పలికారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్‌ పార్టీ చేపట్టిన కార్యక్రమానికి ప్రజల్లో స్పందన రాకపోవడంతో చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వైఖరి మార్చుకోకపోతే ప్రజలు గ్రామాల్లో తిరగనీయరని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు, సర్పంచ్‌లు, డైరెక్టర్లు సంజీవరెడ్డి, శ్రీనివాసగుప్తా, ఐలయ్య, మల్లేశం, రాజు, రవి, కిష్టయ్య, సుదర్శన్‌, రూపేశ్‌, తిరుపతి, శ్రీనివాస్‌, గణేశ్‌, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్‌ కార్నర్‌తో బీజేపీ బలోపేతం



మాట్లాడుతున్న సురేశ్‌గౌడ్‌

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనపై ప్రజలకు అవగాహన కల్పించి బీజేపీని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగమే స్ట్రీట్‌ కార్నర్‌ సమావేశాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట శక్తి కేంద్రం ఇన్‌చార్జి అప్పాల బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రామాలన్నింటికి 14, 15 ఫైనాన్స్‌ కింద కేంద్రం ఇచ్చిన నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి జనగామ నియోజవర్గానికి చేసిందేమి లేదన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌ చేస్తున్న మోసాలను ప్రజలు వివరించి బీజేపీని బలోపేతం చేసేందుకు గ్రామాల్లో స్ట్రీట్‌ కార్నర్‌ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్‌రెడ్డి, పాండు, మహేందర్‌రెడ్డి, భాను, నరేశ్‌, గణేశ్‌, లక్ష్మారెడ్డి, సిద్ధారెడ్డి, సంజీవులు, ప్రవీణ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.